రైతుల భూములు మాయమే!

2016-18 మధ్య కాలంలో నల్లగొండ జిల్లా చందంపేటలో నకిలీ పాస్ పుస్తకాల కుంభకోణం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఆర్డీవో కార్యాలయంలో గుట్టలుగా పడి ఉన్న పాస్‌పుస్తకాలను చందంపేట ఎమ్మార్వో, మరికొందరు అధికారులు కలిసి మాయం చేశారు. లంచం ఇస్తే చాలు వారి ఫొటోలు, ఇష్టమొచ్చిన సర్వే నంబర్లతో నకిలీ పట్టాదార్ పాస్ పుస్తకాలు సిద్ధం చేశారు. ఆ రికార్డులను పహాణీల్లోకి కూడా ఎక్కించారు. ఇలా 13,959 ఎకరాల అటవీ భూములకు పట్టాలు ఇచ్చేశారు. భూరికార్డుల నిర్వహణ గ్రామ, మండల స్థాయి అధికారుల చేతుల్లో ఉంటే అవినీతి అనకొండలు ఎలా చెలరేగిపోతాయో చెప్పేందుకు ఇదో ఉదాహరణ.

పటేల్ పట్వారీ వ్యవస్థ పాతుకుపోయిన సమయంలో భూముల రికార్డులే కాదు, రైతుల తలరాతలు కూడా చిటికెలో మారిపోయేవి. అవి రద్దయ్యాక వచ్చిన రెవెన్యూ వ్యవస్థలో పహాణీ రికార్డులు వీఆర్వోల ఇండ్లలో ఉండేవి. వీరు రాసిందే రాత, గీసిందే గీతగా ఉండేది. తమకు కావాల్సిన వారి పేర్లతో బై నంబర్లు వేసి కాగితంలోనే భూములను సృష్టించేవారు. దేవుడి భూములు కూడా స్వాహా అయ్యేవి. 2019 ఏప్రిల్ 17న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లికి చెందిన 50 మంది రైతులు వీఆర్వోపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమకు పాస్‌బుక్ కావాలంటే ఒక్కొక్కరు రూ. లక్ష ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మచ్చుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

- హస్తం పార్టీ వస్తే సంస్కరణలకు సమాధి
- ధరణిని తీసేసి వీఆర్వోలకు పెత్తనం ఇస్తరట
- కౌలుదారుల కాలమ్‌తో మళ్లీ వివాదాలు
- ఉమ్మడి రాష్ట్రంలో రికార్డులన్నీ ఆగమాగం
- ప్రతి ఎకరాకో చిక్కుముడి.. రైతుకో సమస్య
- అన్నదాతలకు అండగా సీఎం కేసీఆర్
- భూ రికార్డుల ప్రక్షాళనతో సంస్కరణలు
- ధరణితో అన్నదాతల చేతికి అధికారం
- మళ్లీ పాత రోజులు తెస్తామంటున్న కాంగ్రెస్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): పటేల్ పట్వారీ, రెవెన్యూ వ్యవస్థలో అక్రమాలు, అన్యాయాలకు రైతులు ఎలా బలయ్యేవారో చెప్పేందుకు పై రెండు ఉదాహరణలు చాలేమో. ధరణి వచ్చిన తర్వాతనే రైతుల జీవితాలు కుదుటపడ్డాయి. తమ భూములకొచ్చిన ఢోకాలేదని గుండెపై చేయి వేసి హాయిగా నిద్రపోగలుగుతున్నారు. వారు అలా హాయిగా, సంతోషంగా ఉండడం చూసి తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ధరణిని తీసుకెళ్లి బంగాళాఖాతంలో కలిపేస్తామని భయపెడుతున్నది. రైతులను గోసపెట్టుకున్న వీఆర్వోలకే మళ్లీ పెత్తనం ఇస్తామని చెప్తున్నది. కౌలుదారుల కాలమ్‌తో మళ్లీ కొట్లాటలు పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నది. ప్రశాంతంగా ఉన్న రైతుల జీవితాల్లో నిప్పులు పోయాలని చూస్తున్నది. అయితే, వారి ఆటలు సాగనివ్వబోమని రైతులు తెగేసి చెప్తున్నారు. ధరణితో హాయిగా ఉన్నదని, దీనిని తీసేస్తామంటున్న కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వబోమని ప్రతిజ్ఞ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఏర్పడిన కేసీఆర్ ప్రభుత్వం సర్వే చేయిస్తే 99 శాతం భూములపై ఏదో ఒక వివాదం ఉన్నట్టు వెల్లడైంది. గతంలో దక్ష్ అనే సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం సివిల్ కోర్టుల్లోని కేసుల్లో 66 శాతం భూ వివాదాలకు సంబంధించినవే ఉన్నాయి. కోర్టుల చుట్టూ తిరిగే కుటుంబాల్లో 75 శాతం మందికి నెలవారీ సంపాదన రూ.25 వేల లోపే ఉన్నదని స్పష్టం చేశాయి. దేశంలో జరుగుతున్న హత్యల్లో 14 శాతం భూ తగాదాల వల్లే జరుగుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. రికార్డులు సరిగా లేక రైతులు ఎకరానికి ఏటా రూ.50వేల వరకు కోల్పోతున్నారని పేర్కొన్నది. భూ తగాదాల వల్ల జాతీయ ఆదాయానికి 1.3 శాతం నష్టం కలుగుతున్నట్టు వివరించింది.

సంస్కరణల పథం.. భూమి భద్రం

- 'నేను కూడా కాపోన్నే.. నాకు కూడా పొలం ఉన్నది. వ్యవసాయం చేస్త. రైతు కష్టాలు నాకూ తెలుసు'.. సీఎం కేసీఆర్ తరుచూ చెప్పే మాట. రైతుల కష్టాలను కండ్లారా చూసిన కేసీఆర్ భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికేందుకు పలు సంస్కరణలు తీసుకొచ్చారు.
- 2017లో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూముల రికార్డులను పరిశీలించి, నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.56 కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. 2.38 కోట్ల ఎకరాల పట్టాలు క్లియర్‌గా ఉన్నట్టు తేల్చారు. ఇందులో 1.42 కోట్ల ఎకరాలు వ్యవసాయ భూమిగా గుర్తించారు. రికార్డులన్నీ డిజిటలైజ్ చేశారు.
- కొత్త రికార్డుల ఆధారంగా కొత్త పాస్ పుస్తకాలను మంజూరు చేశారు. గతంలో పాస్ పుస్తకాల్లో ఉన్న కాలమ్‌లన్నింటినీ తొలిగించారు. హక్కుదారు కాలం మాత్రమే ఉంచారు. 2018 నుంచి కొత్త పాస్ పుస్తకాల పంపిణీ మొదలుపెట్టారు.
- రెవెన్యూలో అవినీతికి వీఆర్వో వ్యవస్థే అసలు కారణమని గుర్తించారు. దానిని రద్దుచేస్తూ 2020 సెప్టెంబర్ 9న అసెంబ్లీలో బిల్లును ఆమోదించారు. దీంతోపాటు కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చారు. 5,576 మంది వీఆర్వోలను ఇతర శాఖల్లోకి బదిలీ చేశారు.
- ఆధునీకరించిన భూమి రికార్డులతో ప్రభుత్వం 'ధరణి' పోర్టల్‌కు రూపకల్పన చేసింది. 2020 సెప్టెంబర్ 29న సీఎం కేసీఆర్ ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. వ్యవసాయ, వ్యవసాయేతర, ప్రభుత్వ భూముల వివరాలన్నింటినీ అందులో పొందుపరిచింది. భూ రికార్డుల నిర్వహణను అధికారుల చేతుల్లో నుంచి తీసేసింది. ధరణి పోర్టల్ ఆధారంగానే భూ లావాదేవీలు జరిగేలా పటిష్ట వ్యవస్థను రూపొందించింది. రైతు వచ్చి వేలిముద్ర వేస్తే తప్ప పట్టా మార్పిడి జరగని పరిస్థితి వచ్చింది. అప్పటి నుంచి భూ వివాదాలకు చెక్ పడింది.
- ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ అత్యంత సులభంగా, పారదర్శకంగా మారింది. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ మొత్తం తహసీల్దార్ కార్యాలయంలోనే జరుగుతున్నది.
- ధరణితో అధికారుల విచక్షణాధికారాలకు కత్తెర పడింది. రికార్డులను వీఆర్వోలు, ఆర్ ఐలు, తాసిల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు ఇష్టం వచ్చినట్టు మార్చే అవకాశం లేకుండా పోయింది. రైతు వచ్చి వేలిముద్ర వేసినప్పుడే హక్కులు మారిపోతాయి. రికార్డుల్లో ఏవైనా తప్పులు ఉంటే రైతు స్వయంగా దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ పరిశీలించి మార్పులు చేసేలా పోర్టల్ సదుపాయం కల్పించింది.
- వీఆర్ఏలు తరతరాలుగా వెట్టిచాకిరీకి ఆనవాళ్లుగా మిగిలిపోయారు. ఈ నేపథ్యంలో వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారిని ఇతర శాఖల్లో విలీనం చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. సుమారు 23వేల మందిని ప్రభుత్వ శాఖల్లోకి తీసుకొని, పేస్కేల్ అమలు చేస్తున్నారు.
- ధరణితో ప్రభుత్వం దగ్గర 65 లక్షల మంది రైతుల డాటా తయారుగా ఉన్నది. రైతు బంధు, రైతుబీమా వంటి పథకాలు, పంట కొనుగోళ్లు వంటి ఇతర ప్రయోజనాలు నేరుగా రైతు ఖాతాల్లోనే పడుతున్నాయి.
- రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఎంత మంది రైతులు ఉన్నారు? వారి ఆధీనంలో ఎంత భూమి ఉన్నది? అక్కడ ఏయే రకమైన పంటలు వేస్తారు? వంటి సమగ్ర వివరాల అధికారిక రికార్డు ప్రభుత్వం దగ్గర ఉన్నది. కాబట్టి విద్యుత్తు ఎంత అవసరం అవుతుందో, దాని కోసం ఎంత ఖర్చు అవుతుందో కచ్చితంగా అంచనా వేయగలుగుతున్నది.

మొత్తంగా.. ఇప్పుడు రైతు విద్యావంతుడా, నిరక్షరాస్యుడా అన్న సమస్య లేదు. లంచాలు ఇవ్వాలన్న రంది లేదు. ధరణితో తన వేలి కొసతో, కంటిచూపుతోనే తన భూమిని, తనకు ఇష్టం ఉన్నవారి పేరుమీదికి మార్చే శక్తి వచ్చింది. దళారుల దందాలు బంద్ అయ్యాయి. అధికారులు, నేతల బెదిరింపులకు చరమగీతం పాడింది. పైగా రాష్ట్రంలో రైతులు ఎంతమంది? ఎంత విస్తీర్ణం? ఏయే పంటలు వేస్తున్నారు? వంటి వివరాలన్నీ ప్రభుత్వం దగ్గర పక్కాగా ఉన్నాయి. దీంతో ఏయే ఎరువులు, ఎంత మేర స్టాక్ పెట్టుకోవాలో అంచనా వేస్తున్నారు. ముందస్తుగానే స్టాక్‌ను పెడుతున్నది. ఫలితంగా లైన్లల్లో నిలబడే గోస, చెప్పులు, పాస్ బుక్కులు లైన్లలో పెట్టే దుస్థితి తప్పింది.

మళ్లా పైరవీకారులను తెస్తారట

ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ పదేపదే చెప్తున్నది. పాస్ పుస్తకాల్లో పాత పద్ధతిలోనే 36 కాలమ్‌లు పొందుపరుస్తామని కాంగ్రెస్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఖరాఖండిగా చెప్తున్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో బాజాప్తా వీఆర్వో పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. అంటే మళ్లీ వీఆర్వోలను నియమించి, గ్రామస్థాయిలోనే రైతుల భూములను ఇష్టం వచ్చినట్టు మార్చే పాత, రాత పద్ధతిని తీసుకొస్తామని చెప్పింది. రైతు బంధు అందుకుంటున్నవారిలో 90 శాతం మంది సన్న, చిన్నకారు రైతులే. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు 58 లక్షల మంది వరకు ఉన్నారు. అంటే మొత్తం రైతుల్లో 92 శాతం మంది. ధరణి పోర్టల్ ఎత్తివేసినా, రైతుబంధు ఆగిపోయినా పండుకు 92 మంది రైతుల బతుకులు చీకట్లో మగ్గిపోతాయన్నమాట. రైతులు మళ్లీ ఎరువుల కోసం లైన్లలో నిలబడాల్సి వస్తుంది. 24 గంటల కరెంట్ స్థానంలో వాళ్లు చెప్తున్న మూడు గంటల కరంటే వస్తుంది. చివరికి.. రైతు బతుకు ఆగమవుతుంది.

ధరణి లేకపోతే రైతులు ఆగమవుతారు

నారాయణరావుపేట, నవంబర్ 18: తెలంగాణ రాక ముందు ఉన్న పట్వారీ వ్యవస్థ వల్ల మస్తు గోస పడ్డాం. అప్పుడు పహాణీ కావాలంటే పట్వారీ దగ్గరికి వెళ్తే ఎంతో కొంత పైసలు ఇవ్వాల్సి వచ్చేది.పట్వారీలు ఉన్నప్పుడు పంట నష్టం రాయాలన్నా, బ్యాంక్ లోన్‌కు భూమి రికార్డులు కావాలన్నా ఎంతో కొంత ఖర్చు అయ్యేది. అధికారుల సుట్టు తిరిగేది. భూమి కొని పట్టా చేసుకున్న తర్వాత దానిని రికార్డుల్లోకి ఎక్కించి మ్యుటేషన్ చేయించాలన్నా. పట్టా పాసుబుక్ కావాలన్నా తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి ఇబ్బంది పడేది. తెలంగాణ వచ్చినంకా కేసీఆర్ సార్ ధరణితో ఒక్క దగ్గరనే రిజిస్ట్రేషన్ మ్యుటేషన్ చేసి సాయంత్రం వరకు పాసు బుక్ ఇస్తున్నారు.ఇప్పుడు మా భూమిపై మాకు పూర్తి అధికారం వచ్చింది. ధరణి తెచ్చి మాకు రైతు బంధు ఇస్తున్నారు. కాంగ్రెసోళ్లు ధరణి లేదు ఏమీ లేదు అంటున్నారు. ధరణి లేకపోతే రైతులు ఆగమవుతారు

- పాతర్ల అంజయ్య, రైతు, గుర్రాలగుంది (సిద్దిపేట జిల్లా)

పట్వారీ వ్యవస్థ వస్తే కష్టాలు కొనితెచ్చుకునుడే

గతంలో పట్వారీ వ్యవస్థతో రైతులం దరూ ఎన్నోపాట్లు పడ్డారు. కౌలుదారు, పట్టాదారు కాలమ్ పెట్టి మరీ భూములున్న రైతులను నట్టేట ముంచారు. కాంగ్రెసోళ్లు అధికారం కోసం ధరణి తీసి భూమాత పెట్టి మా రైతులను బొందపెడుతారా? ఇలాంటి పిచ్చిపిచ్చి ఆలోచనలు చేసి రాష్ట్ర రైతాంగాన్ని ఆగంజేస్తరేంది. ధరణి పోర్టల్ వల్ల పైర వీలు లేకుండా పోయినవి. ఇప్పుడు సిస్టం బాగున్నది.

-నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు, గుమ్మడిదల మండలం (సంగారెడ్డి జిల్లా)

అప్పట్ల అరిగోస పడ్డం

కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు పటేల్ పట్వారీలతో అరిగోస పడ్డం. ఆర్‌వోఆర్ పేరుతో భూములు పట్టా చేసేందుకు పైసలిచ్చేటోళ్లం. డబ్బులిస్తే ఒకరి పేరుతో ఉన్న భూమిని మరొకరి పేరుతో మార్చి పట్వారీలు గోసపెట్టుకున్నరు. తెలంగాణ వచ్చినంక ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి తీసుకువచ్చి భూములకు భద్రత కల్పించిండు. పట్టాదారు అనుమతి లేనిదే భూమి మార్చిడి చేసే అధికారం లేకుండా చేసిండు. మళ్లా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పటేల్ పట్వారీల వ్యవస్థ తీసుకువస్తామని చెప్పడం సరైంది కాదు. కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోస పడ్డరు.

- బైకన అయిలుకొండు, రైతు, ఉప్పల్, కమలాపూర్(హనుమకొండ)

పైసలిస్తేనే పట్టా

ఒకప్పుడు భూమి హక్కుల మార్పిడి అంటే కైలాసం ఆడినట్టే ఉండేది. ఒక నిచ్చెన ఎక్కామని సంతోషపడే లోపే పాము మింగేసేది. ఒక వ్యక్తి వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, దానికి పాస్‌బుక్ పొందాలంటే సవాలక్ష అడ్డంకులు ఉండేవి. డాక్యుమెంట్ రైటర్ నుంచి ప్రతి ఒక్కరి చేతులు తడపాల్సి వచ్చేది. అడిగినంత ముట్టజెప్తే తప్ప పని పూర్తయ్యేది కాదు. కొన్ని సందర్భాల్లో మాన్యువల్‌గా 1బీ, పహాణీల్లో పేర్లు మార్చి పాస్‌బుక్ ఇచ్చేవారు. చేతిలో పాస్‌బుక్ ఉన్నా ఆన్‌లైన్‌లో మాత్రం పాత యజమానుల పేర్లే కనిపించడంతో ఒకే భూమిపై డబుల్ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు జరిగేవి. ధరణి పోర్టల్‌ను ప్రారంభించిన తర్వాత ప్రభుత్వం పెండింగ్ మ్యుటేషన్లకు అవకాశం కల్పించింది. 1,79,470 పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తులు పరిష్కరించింది. అంటే, గతంలో ఉన్న దోపిడీ విధానాలు, అసంబద్ధ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 1.79 లక్షల మంది మ్యుటేషన్ చేయించుకోలేకపోయారన్నమాట.

ఒక్క బుగ్గకే ఫ్రీ కరెంటు

- ఒక లైట్, ఒక ఫ్యాన్, ఒక టీవీ ఉంటేనే ఉచితం
- అంతకు మించితే ఉచితం నిల్
- ఉచిత కరెంట్‌పై షబ్బీర్ అలీ ప్రకటన
- 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ ఝూటా మాటేనా?
- కర్ణాటకలోనూ ఇదే పనిచేసిన కాంగ్రెస్ పార్టీ
- హస్తం హామీని నమ్మితే తెలంగాణలోనూ అదే పరిస్థితి

హైదరాబాద్, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): అనుకొన్నదే నిజమైంది. అధికారం కోసం కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలైనా చెప్తుందన్న వాస్తవం మరోసారి రుజువైంది. పోలింగ్‌కు ముందు ఉచిత విద్యుత్తుపై మెలికలు పెట్టడం మొదలైంది. కర్ణాటకలో ఓట్లు వేయించుకొని కన్నడిగులను ఎలా అయితే ముంచిందో.. అదే రీతిలో తెలంగాణలోనూ చేయబోతున్నట్టు ఆ పార్టీ నేతే నోరు జారారు. తాము అధికారంలోకి వస్తే గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు (గృహజ్యోతి) ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఉచిత విద్యుత్తు కావాలంటే ఇంట్లో ఒక్కటే కరెంటు బుగ్గ ఉండాలని, ఒక్కటే ఫ్యాన్ ఉండాలని, ఒక్కటే టీవీ ఉండాలని కాంగ్రెస్ నేత మహమ్మద్ షబ్బీర్ అలీ తాజాగా ప్రకటించారు. అచ్చం కర్ణాటకలోనూ కాంగ్రెస్ ఇదే పని చేసింది. కాకపోతే అక్కడ అధికారం చేపట్టిన తర్వాత ప్రజలను ఎగిరి తన్నింది. ఇప్పుడు అనుకోకుండా ఆ పార్టీ రహస్యాన్ని ముందుగానే బయటపెట్టేశారు. ఉచితం అంటే ఉచితం కాదని, షరతులు వర్తిస్తాయని సెలవిచ్చారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ...'ఒక ట్యూబ్‌లైట్, ఒక బల్బు, ఒక ఫ్యాన్, ఒక టీవీ.. ఇంతవరకైతే ఫ్రీ కరెంట్ ఇస్తాం' అని ప్రకటించారు. అదే నిజమైతే ఉచిత కరెంటు దేవుడెరుగు.. ఉన్న కరెంటు కూడా పోతది. కర్ణాటక మాదిరిగానే కరెంటు బిల్లుల మోతతో తెలంగాణ ప్రజల నడ్డి విరుగతది.

ఇలా అయితే ఎవరికైనా వర్తిస్తదా..?

వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ తన ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రకటించింది. అయితే ఇందులో అమలు చేయబోయే షరతులను మాత్రం దాచిపెట్టింది. ఇప్పుడు ఆ షరతులను షబ్బీర్ అలీ బయటపెట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఇంటిలో అయినా ఒకటే బల్బు, ఒకటే ఫ్యాన్ ఉండటం అసాధ్యం. సింగిల్ బెడ్‌రూం ఇంట్లో అయినా కనీసం మూడు లైట్లు ఉంటాయి. రెండు ఫ్యాన్లు ఉంటాయి. ఇక టీవీ, ఫ్రిజ్ కూడా సాధారణమే. ఇవి లేని కుటుంబాలు ఒకటి రెండు శాతం కూడా ఉండవు. ఈ లెక్కన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసుకుంటున్న గృహజ్యోతి పథకం ఏ ఇంటికీ వర్తించదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 200 యూనిట్ల వరకు ఫ్రీ అని చెప్తూ.. ఇలా కండిషన్లు పెట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీది పచ్చి మోసం అని ప్రజలు మండిపడుతున్నారు.

వ్యవసాయం చేయలేం

3 గంటల కరెంట్‌తో వ్యవసాయం చేయలేం. ఇప్పుడు 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ ఇస్తున్నారు. 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని, మంచిగా పంటలు పండించుకుంటున్నాం. అట్లకాదని 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని, 3 గంటల కరెంట్‌తో పంటలు పండించుకోలేం. 10 హెచ్‌పీ మోటర్‌తో ట్రాన్స్‌ఫారంపై లోడ్ పడుతుంది. స్టార్టర్లు, మోటార్లు కాలిపోతాయి. దానికి పెద్ద రూటర్, పెద్ద షాప్ ఉంటుంది. ఏదన్నా ప్రాబ్లం వచ్చి బయటకు తీయాలంటే కూడా ఇబ్బందే. 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటార్లతో వ్యవసాయం జరుగదు. ఇచ్చినా మాకు వద్దు. ఇది రైతులకే కాదు ప్రభుత్వానికీ భారమే. *- ఇంద్రసేనారెడ్డి, రైతు -కేశవరం, మేడ్చల్ జిల్లా*

కాంగ్రెస్ వస్తే పాముకాట్లు.. కటిక చీకట్లు

- మళ్లీ మోటర్లు కాలుడు.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలుడే ఉంటది
- నాడు పొలంవద్దే రైతు కుటుంబాలు
- ఇచ్చిందే మూడు గంటల లో కరెంటు
- చీకట్లో పాము కాట్లకు రైతులు బలి
- నాటి పరిస్థితి తల్చుకొని వణికిపోతున్న అన్నదాతలు
- సాగు పండు చేసుకోవాలో.. దండుగ చేసుకోవాలో..
- నిర్ణయం రైతుల చేతుల్లోనే..

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పేరు చెప్తేనే రైతన్న కన్నెజేస్తున్నాడు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘంగా సాగిన కాంగ్రెస్ పాలనలో పడిన ఎడతెరిపి లేని కష్టాలను తల్చుకొని వణికిపోతున్నాడు. ఇప్పుడు మళ్లీ మూడు గంటల కరెంటు పాట పాడుతున్న కాంగ్రెస్ పొరపాటున అధికారంలోకి వస్తే తమకు ప్రత్యక్ష నరకం తప్పదని తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని అగమ్య గోచర కాలమది.. రాత్రిళ్లు కరెంటు కోసం బాయికాడికి వెళ్లి పాములు కరిచి చనిపోయిన ఘటనలు కోకొల్లలు. రాత్రిపూట చేలల్లోనే గడిపిన ఆ కాళరాత్రుల కష్టాలు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తున్నదని రైతన్నలు చెప్తున్నారు.

ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న అన్నదాతలు

పదేండ్ల కిందటి కరెంటు కష్టాలు, సాగు బాధల నుంచి గట్టెక్కిన తెలంగాణ రైతాంగం.. సొంత రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల పూర్తి ఉచిత విద్యుత్తుతో రెండేసి పంటలను పండిస్తూ సంతోషంగా ఉన్నది. కాంగ్రెస్ హయాంలో పడ్డ కష్టాలను మెల్లమెల్లగా మర్చిపోతున్నారు. నాడు పంటలు చేతికి రాక.. చేసిన అప్పులు తీరక అన్నదాతలు పడ్డ అగచాట్లను తమ జ్ఞాపకాల్లోంచి తుడిచేస్తున్నారు. మళ్లీ కాంగ్రెస్ వస్తే ఉరికొయ్యల పాలు కావటం తప్ప మరో మార్గం ఉండదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మరోసారి మూడు గంటల కరెంటు అంటుంటే అల్లాడిపోతున్నారు. కరెంటు లేక కండ్ల ముందే పంటలు ఎండిపోవటం, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్ల కాలిపోయి పడిన యాతనలు గుర్తుచేసుకొంటున్నారు. పంటలు చేతికి రాక, చేసిన అప్పులు తీర్చలేక పొలాల్లోనే పురుగుల మందు తాగి, ఉరివేసుకుని చనిపోయిన అన్నదాతల కుటుంబాల ఆక్రందనలు ఇంకా రైతన్నల చెవుల్లో మారుమోగుతూనే ఉన్నాయి. నాడు 7 గంటలు పేరుచెప్పి 5 గంటలు కరెంటు ఇవ్వలేదని, ఇప్పుడు ఏకంగా మూడు గంటలే కరెంటు చాలు అంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

నేతల కోతలు.. కరెంటు వాతలు

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో సుమారు 19 లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉండేవి. వీటికింద సుమారు 50 లక్షల ఎకరాల భూమిని రైతన్నలు సాగుచేసేవారు. రాష్ట్రం ఏర్పడే సమయంలో అప్పుడు వచ్చిన గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 5,661 మెగావాట్లు మాత్రమే. అప్పట్లో ఉన్న స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్లు. అయినప్పటికీ.. డిమాండ్ మేరకు విద్యుత్తును కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేకపోయేది. గరిష్ఠ డిమాండ్‌లో కొరత 2,700 మెగావాట్ల వరకు ఉండేది. దీంతో నిత్యం కరెంటు కోతలతో రైతులతోపాటు సామాన్య ప్రజలకు కూడా నరకం చూపించింది. అధికారికంగానే రోజూ దాదాపు 8 గంటలపాటు గృహ, వాణిజ్య వినియోగదారులకు కోతలు విధించారు. గ్రామాల్లో అయితే రోజూ 12 నుంచి 16 గంటలపాటు కోతలుండేవి. అలాగే మండల కేంద్రాల్లో 8 నుంచి 12 గంటలు, జిల్లా కేంద్రంలో 6 నుంచి 10 గంటలు, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ 4 నుంచి 6 గంటల పాటు విద్యుత్తు కోతలు ఉండేవి. పరిశ్రమలకు వారానికి రెండు రోజులు పవర్ హాలిడే. వ్యవసాయానికి ఆరు గంటలపాటు అని చెప్పినా.. పగటి పూట 3 గంటలు.. రాత్రి పూట 3 గంటలు ఇచ్చేవారు. అది కూడా ఐదారు విడతలుగా సరఫరా చేసేవారు. దీంతో ఎక్కడ చూసినా కరెంటు పోరాటాలే కనిపించేవి. ధర్నాలు, నిరసనలు, దిగ్బంధనాలు, ముట్టడిలు, రాస్తారోకోలు నిత్యకృత్యం. అధికారుల నిర్బంధం, నాయకులు ఘెరావ్‌లతో పోలీసుల కేసులను ఎదుర్కొంటూ కోర్టుల చుట్టూ తిరిగిన రైతుల వేల మంది ఉన్నారు.

కాలిపోయే మోటార్లు.. పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు

లో ఓల్టేజీ కరెంటుతో కాంగ్రెస్ పాలనలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు పటాకుల్లా పేలిపోయేవి. రైతుల మోటర్లయితే ప్రతి నెలా రిపేరుకు పోవాల్సిందే. నాడు గ్రామాల్లో విద్యుత్తు మోటర్లు రిపేర్ చేసే మెకానిక్‌కు ఉన్న డిమాండ్ వేరెవరికీ ఉండేది కాదు. మెకానిక్ షాపుల వద్ద రైతులు అర్ధరాత్రి వరకు పడిగాపులు పడి పంపులను రిపేర్ చేయించుకొని వెళ్లేవారు. సమస్యలను పరిష్కరించేందుకు రైతులే విద్యుత్తు ఉద్యోగులై, కరెంటు షాకులతో తనువు చాలించిన ఘటనలు అనేకం.

అర్ధరాత్రి చేనుల్లో జీవితం

కాంగ్రెస్ హయాంలో మూడు గంటలు పగలు.. మూడు గంటలు రాత్రిళ్లు విద్యుత్తు సరఫరా చేయడంతో రైతుల జీవితం దాదాపుగా పొలాలు, చేనుల్లోనే గడిచేది. తండ్రి.. లేకపోతే కొడుకు.. అదీగాక పోతే భార్యో.. ఇంటి కోడలో.. ఎవరో ఒకరు బావి, బోరు మోటర్ వద్దే ఉండేవారు. కరెంటు కోసం అహోరాత్రులు రైతు కుటుంబం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూసేది. కరెంటు రాగానే ఆటోమెటిక్ స్టార్టర్‌తో మోటర్ పనిచేయడం మొదలు పెట్టినా నీళ్లు మొదటి మడి తడిచేలోగా కరెంటు పోయేది. మళ్లీ కరెంటు వస్తే తడిచిన మడే తడిచి.. మిగతా పొలం ఎండిపోయేది. చాలా రైతు కుటుంబాల్లో అప్పుడే పెళ్లైన యువకులు కూడా భార్యను వదిలి రాత్రిపూట బాయిలకాడ కరెంటు కోసం ఎదురుచూస్తూ గడిపేవారు.

ఇప్పుడు నిర్ణయం రైతన్నలదే..

కేవలం మూడు గంటలే కరెంటు చాలంటున్న కాంగ్రెస్ హయాంలో పదేండ్ల క్రితం వరకు కరెంటు ఎలా ఉండేదో అన్నదాతలకు తెలుసు. తెలంగాణ రైతాంగం అప్పటి కష్టాలను కావాలని కొనితెచ్చుకోవాలా? వద్దా? అనేది నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్నమయ్యింది. సీఎం కేసీఆర్ పరిపాలనలో పండుగలా మారిందని సంతోషపడుతున్న సమయంలో.. మళ్లీ నాటి కష్టాలు కొనితెచ్చుకోవటం అవసరమా? 24 గంటల నిరంతరాయ పూర్తి ఉచిత విద్యుత్తు స్థానంలో మూడు గంటలు.. అదీ ఆగుతూ ముక్కుతూ మూల్గుతూ, మోటర్లు కాలుతూ, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతూ వచ్చే కరెంటును రైతన్న ఎందుకు కోరుకొంటాడు? నాటి పరిస్థితే మళ్లీ వస్తే రైతుల పరిస్థితి బొంబాయి.. దుబాయి